‘ప్రజావాణి’లో సమస్యల పరిష్కారం



ప్రజావాణిలో పాల్గొన్న జెడ్‌సీ అపూర్వ చౌహాన్, అధికారులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ హాజరై సమస్యలపై పలువురి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. టౌన్ ప్లానింగ్ 9, ఇంజినీరింగ్ 11, హెల్త్, శానిటేషన్ 3, ఎలక్ట్రికల్ 2, ఎంటమాలజీ 1, పార్కులు 2, డీపీఓ 1 మొత్తం 29 సమస్యలపై పలువురు ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్‌సీ మాట్లాడుతూ.. సమస్యలను ఆయా శాఖల అధికారులు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అలసత్వం వహించొద్దని సూచించారు.

స్వాగతం పలికేందుకు తరలాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: ఏన్నో ఏళ్ల పోరాట ఫలితంగా మాదిగ జాతికి మందకృష్ణ మాదిగ అందించిన విజయానికి గుర్తుగా ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు పెద్ద ఎత్తున తరలాలని ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ ఎమ్మార్పీఎస్ నాయకులు తీర్మానించారు. సోమవారం డివిజన్ ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి మంద మధుకర్ మాదిగ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. మందకృష్ణ మాదిగ ఢిల్లీ నుంచి మంగళవారం సికింద్రాబాద్‌కు చేరుకుంటున్న సందర్భంగా ఘన స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. సమావేశంలో సత్యం, ముత్యాపాగా శ్రీనివాస్, బ్యాగరి నరసింహ, బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు గుండాల జగదీష్, నరసింహ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ మహేందర్

మోతీనగర్: కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరుతో గద్దెనెక్కి.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తకపోవటం హాస్యాస్పదంగా ఉందని, వెంటనే గ్యారంటీలను అమలు చేయాలని కార్పొరేటర్ మహేందర్ అన్నారు. అవంతినగర్ కాలనీలో బీజేపీ మూసాపేట డివిజన్ కార్యవర్గ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బూత్ స్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేయాలని నాయకులకు సూచించారు. మరో వైపు నిరుద్యోగ సమస్యపై యువతను చైతన్యం చేయాలన్నారు. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్ కార్డులు మంజూరు చేయకపోవటం సిగ్గు చేటన్నారు. కేంద్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో డివిజన్ ఇన్‌చార్జి మల్లేష్‌గౌడ్, నాయకులు ఎర్రస్వామి, రమేష్ నాయర్, ఐలయ్య యాదవ్, భాస్కర్, బసవరాజు, శ్రీనివాస్, వెంకట్, శ్రీకాంత్, సతీష్ చారి తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార వైభవ రత్న అవార్డు అందజేత



మోతీనగర్: సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్ వేదికగా లలిత కళా సమాఖ్య సేవా సామాజిక సాంస్కృతిక సంస్థ రుద్రాక్ష వైభవం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వ్యాపార వైభవ రత్న అవార్డులను అందజేశారు. మూసాపేట డివిజన్ మోతీనగర్‌కు చెందిన ఐవీఎఫ్ నగర అధ్యక్షుడు ఊటుకూరు శ్రీనివాస్ గుప్తాకు వ్యాపార వైభవ రత్న అవార్డును బ్రహ్మశ్రీ శ్రీకృష్ణ చాముండేశ్వరి మహర్షి అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న బండి రమేష్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ప్రకాష్ నగర్‌కి చెందిన మున్ని కృష్ణ నాయుడు బ్రెయిన్ స్ట్రోక్ వల్ల ఓ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అనంతరం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గొట్టిముక్కల వెంకటేశ్వరరావును సంప్రదించగా.. ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. సోమవారం రూ.60 వేల చెక్కును కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్ కృష్ణ నాయుడు భార్య లలిత, కుమార్తె జయలకు అందజేశారు.

బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగా యాత్ర



ఆల్విన్ కాలనీలో జాతీయ జెండాలతో తిరంగా యాత్రలో పాల్గొన్న నాయకులు, విద్యార్థులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం యాత్ర ప్రోగ్రాం కో ఆర్డినేటర్ శైలేష్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో సోమవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లంగటి నరేందర్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్‌యాదవ్, బీజేపీ రాష్ట్ర నాయకులు రవీందర్‌రావు, జిల్లా కార్యదర్శి ప్రవంతి, నాయకులు నర్సింగ్ యాదవ్, నరసింహాచారి, రాహుల్, జ్యోతి, అనూష, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతా

• ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు • జోనల్ కమిషనర్‌తో కలిసి సమస్యల పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డు కాలనీ సమస్యలను పరిష్కరించి ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం కేపీహెచ్‌బీ కాలనీ మలేషియా టౌన్‌షిప్ వద్ద గల క్రీడా ప్రాంగణంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌తో కలిసి మొక్కలు నాటారు. పార్కు స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటికే కోట్లాది రూపాయలు కేటాయించి పార్కులు, క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామని వివరించారు. కొన్ని చోట్ల నిధులు సరిపోక పనులు పెండింగ్‌లో ఉన్నాయని జోనల్ కమిషనర్‌కు వివరించారు. క్రీడా ప్రాంగణం పక్కనే హౌసింగ్‌బోర్డు ఆధీనంలో ఉన్న నాలుగున్నర ఎకరాల స్థలాన్ని జీహెచ్‌ఎంసీకి కేటాయించి మహిళా పార్కుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వన్‌సిటీ ఎదురుగా రేయిన్ వాటర్ లాగింగ్ సమస్యతో ఇక్కడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, సత్వరమే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నెంబర్1 లోని, మూడవఫేజ్‌లోని, ఏడవ ఫేజ్ వద్ద గల దోబీఘాట్‌లను అభివృద్ధి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన జోనల్ కమిషనర్ ఎమ్మెల్యేతో కలిసి దోబీఘాట్‌లను పరిశీలించారు. ఇప్పటికే నిర్మాణం పూర్తికావచ్చిన క్రీడా ప్రాంగణాన్ని నిర్వహించేందుకు ప్రైవేట్ ఏజెన్సీలను టెండర్ ద్వారా ఎంపిక చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. విడుతల వారీగా నిధులను కేటాయిస్తూ దోబీఘాట్‌లను అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప కమిషనర్ రమేష్, ఎస్ఈ ఈఈ శ్రీనివాస్, డీఈ ఆనంద్, ఏఈ సాయిప్రసాద్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.



దోబీఘాట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్ తదితరులు

ఎంపీ బండి సంజయ్ తీరు మార్చుకోవాలి

ఓల్డ్‌బోయిన్‌పల్లి: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌ను ప్రజలు గెలిపించింది కేటీఆర్‌ను జైలుకు పంపేందుకేనా? అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆయన్ను ప్రశ్నించారు. బోయిన్ చెరువు పరిశీలన అనంతరం ఆయన మాట్లాడారు. బండి సంజయ్ కేంద్ర మంత్రిగా ఏం మాట్లాడుతున్నారో ఆయనకే అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి నిధులు తేవడంలో విఫలమయ్యారన్నారు. ‘దమ్ముంటే కేటీఆర్‌ను జైలుకు పంపు చూద్దాం.. అప్పుడు మీ పాపం పండుతది’ అని హెచ్చరించారు. చిల్లర మాటలు మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేసిన కేటీఆర్‌ను ఎవరూ ఏమీ చేయలేరన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒక్కటై వాళ్లను లోపల వేస్తాం, వీళ్లను లోపల వేస్తామని చెబితే భయపడే పరిస్థితి లేదని, ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కృషి

ఓల్డ్ బోయిన్‌పల్లి: హస్మత్‌పేట బోయిన్ చెరువును ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్, జీహెచ్‌ఎంసీ, ఇరిగేషన్, వాటర్ వర్క్స్, రెవెన్యూ అధికారులు, నాయకులతో కలిసి చెరువును పరిశీలించారు. చెరువులో గుర్రపు డెక్క తొలగింపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులోకి డ్రైనేజీ నీరు రాకుండా బాక్స్ డ్రైనేజీ నిర్మాణం, మనసా సరోవర్ హైట్స్ వద్ద నాలా నిర్మాణం చేపట్టామన్నారు. రూ.14 కోట్లతో చెరువును 80 శాతం అభివృద్ధి చేశామని తెలిపారు. బస్తీ నుంచి డ్రైనేజీ నీరు చెరువులో కలవకుండా ఇతర డ్రైనేజీ పైపులైన్లకు కలపాలని అధికారులకు ఆదేశించారు. అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట వేయాలన్నారు. చెరువు కట్టకు అడ్డుగా ఉన్న గ్రిల్స్‌ను తొలగించి వ్యాపారాల కోసం దారి చేసుకోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. శిఖం భూముల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు మరో రూ.10 కోట్ల నిధుల విడుదలకు తగిన కృషి చేస్తామన్నారు.

ఎన్నికల సమయంలోనే రాజకీయాలు

ఎన్నికల సమయంలోనే రాజకీయాలని, నా ఆలోచన అంతా అభివృద్ధి చేయడం కోసమేనని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, నాయకులు నరేందర్‌గౌడ్, ఇర్ఫాన్, హరినాథ్, జంగయ్య, నర్సింగ్‌రావు, సత్యనారాయణ, సయ్యద్ ఏజాజ్, నాగేష్, ఉదయ్‌కుమార్, యాదగిరి, గణేష్‌చారి, మట్టి శ్రీనివాస్, పోచయ్య, ఉదయరాణి, సరోజదేవి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.



సబ్ స్టేషన్ స్థలాన్ని పరిశీలించిన అనంతరం మహిళలతో ఎమ్మెల్యే, కార్పొరేటర్

జగద్గిరిగుట్ట నుంచి సికింద్రాబాద్‌కు మెట్రో డీలక్స్ బస్సులు

మూసాపేట: కూకట్‌పల్లి డిపోలో సోమవారం రెండు కొత్త మెట్రో డీలక్స్ బస్సులను డిపో మేనేజర్ హరి ప్రారంభించారు. ఈ బస్సులు జగద్గిరిగుట్ట నుంచి సికింద్రాబాద్‌కు ప్రతి గంటకు ఒకటి నడపనున్నట్లు ఆయన తెలిపారు. ఉదయం జగద్గిరిగుట్ట నుంచి మొదటి బస్సు ఉదయం 7 గంటలకు, చివరి బస్సు రాత్రి 7 గంటలకు, సికింద్రాబాద్ నుంచి మరో బస్సు రాత్రి 8.10 గంటలకు చివరి బస్సు ఉంటుందని తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శ్రావణమాసం ప్రత్యేక పూజలు



అన్నదానంలో పాల్గొన్న భక్తులు

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్, అవంతినగర్, మోతీనగర్ ఎక్స్‌టెన్షన్లలోని శివరామాంజనేయ ఆలయంలో శ్రావణమాసం మొదటి సోమవారం సందర్భంగా కాలభైరవ ప్రత్యంగిరి దేవికి శ్రావణమాస ప్రయుక్త అభిషేకం, పూజలు నిర్వహించారు. భక్తులకు మహాదాన ప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన సేవకుడు రమేష్ అయ్యంగార్ పాల్గొన్నారు.

ఏ మేరకు అవగాహన ఉందో ప్రజలకు తెలుసు

కూకట్‌పల్లి: ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు సమస్యలపై ఏ మేరకు అవగాహన ఉందో నియోజకవర్గ ప్రజలకు బాగా తెలుసని కాంగ్రెస్ కేపీహెచ్‌బీ కాలనీ ఉపాధ్యక్షుడు అరవింద్ రెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లోనే 90శాతం పైగా అభివృద్ధి జరిగిందని చెప్పి.. మళ్లీ నియోజకవర్గంలో అభివృద్ధి కోసం సమస్యలపైన ఎందుకు మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. బండి రమేష్‌పై విమర్శలు మానుకోవాలన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల కల సాకారం చేసేందుకు కృషి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: జర్నలిస్టుల ఇళ్ల కల సాకారం చేసేందుకు కృషి చేస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. సోమవారం టీయూడబ్ల్యూజే-ఐజేయూ శేరిలింగంపల్లి నూతన ప్రెస్‌క్లబ్ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే-ఐజేయూ నాయకులు కొండా విజయ్‌కుమార్, సలీమ్‌పాషా, అశోక్‌యాదవ్, ప్రణయ్ ముదిరాజ్, శ్రీనివాస్, మల్లేష్, వరుణ్, గోవర్ధన్‌రెడ్డి, నాగరత్నం, మాధవరెడ్డి, తిరుపతిరెడ్డి, ప్రసాద్, సత్యనారాయణ, అనిల్‌రెడ్డి, జయరామ్, ప్రభాకర్, రమేష్, శంకర్, నర్సింహ, మహేందర్, సతీష్, వెంకటేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

హెచ్‌సీయూ ఆంగ్ల శాఖాధిపతి ఆచార్య మురళీమనోహర్



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌సీయూ ప్రొ.మురళీమనోహర్

చందానగర్: ప్రస్తుతం యువత ప్రపంచ స్థాయి సాంకేతిక నైపుణ్యాలను అందిపుచ్చుకోవడంలో వెనుకంజలో ఉన్నారని, సాంకేతికతపై పట్టు సాధించేలా ముందుకు సాగాలని హెచ్‌సీయూ ఆంగ్ల శాఖాధిపతి ఆచార్య దాసరి మురళీమనోహర్ పేర్కొన్నారు. ఏ దేశమైనా అభివృద్ధిలో ముందుకుసాగాలంటే యువత కీలకం అని తెలిపారు. హఫీజ్‌పేట్‌లోని కల్లం అంజిరెడ్డి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత అంటేనే శక్తి, మెరుపు వేగం, వినూత్న ఆలోచనలు ,తలచుకుంటే ఏదైనా చేసి చూపించే సత్తా వారి సొంతమన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ గణేష్, ఇన్‌చార్జీ శ్రీనివాస్, అసోసియేషన్ సభ్యులు ధర్మసాగర్, మల్లేష్, పలువురు ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదుపు తప్పిన ట్రాలీ ఆటో.. పాదచారి మృతి

గచ్చిబౌలి: వాటర్ క్యాన్‌ల లోడ్‌తో అతి వేగంగా వెళుతున్న ట్రాలీ ఆటో పల్టీ కొట్టడంతో అటుగా వెళుతున్న ఓ పాదచారి దుర్మరణం పాలైన ఘటన రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బిహార్ రాష్ట్రం ముజఫర్‌నగర్‌కు చెందిన ముఖేష్ కుమార్ మిశ్రా(32) ఆర్‌ఎంజడ్ బిల్డింగ్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. హాఫీజ్‌పేట్‌కు చెందిన సోఫియా వాటర్ డిస్ట్రిబ్యూటర్ రమేష్ వద్ద బిహార్‌కు చెందిన ఆదిల్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ట్రాలీ ఆటోలో వాటర్ క్యాన్‌లు తీసుకొని సోమవారం ఉదయం 7.30 గంటల సమయంలో మై హోం భూజ నుంచి లింకు రోడ్డులో ప్రధాన రహదారి వైపు అతి వేగంగా వెళుతుండగా ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో అటుగా నడుచుకుంటూ వెళుతున్న పాదచారి ముఖేష్ కుమార్‌ను ఢీ కొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటో డ్రైవర్ ఆదిల్ పరారీలో ఉన్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్థలాల క్రమబద్ధీకరణపై కదలిక

- మూడు నెలల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను పరిష్కరించేలా కసరత్తు
- నోటీసు సమస్యల నివృత్తికి సహాయ కేంద్రాలు
- నాలుగు దశల్లో దరఖాస్తుల పరిశీలనకు చర్యలు
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 1.43 లక్షలు



సాక్షి, సిటీబ్యూరో: అక్రమ లే అవుటు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. వీటిని మూడు నెలల్లో పరిష్కరిస్తామని తాజాగా సర్కారు ప్రకటించడంతో దరఖాస్తుదారుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఇందుకు సంబంధించి విధివిధానాలు జారీ కావటంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని వేలాది మందికి లబ్ధి చేకూరనుంది.

- గత ప్రభుత్వ హయాంలో పురపారపాలక సంఘాలు, గ్రామ పంచాయతీల పరిధిలో 2020 ఆగస్టు 26 ముందు రిజిస్టర్ అయిన అనధికారిక ప్లాట్లు, లే అవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు అనుమతి ఇచ్చింది. అందులో భాగంగానే అక్టోబర్ 31 వరకు దరఖాస్తులను స్వీకరించారు. ఆన్‌లైన్‌లో రూ. వెయ్యి చెల్లించి వివరాలు నమోదు చేసుకున్నారు. అప్పటి నుంచి దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వీటికి క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు జారీ చేస్తారు.
- జిల్లాలోని బోడుప్పల్, పీర్జాదిగూడ, నిజాంపేట, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్లు, మేడ్చల్, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, దుండిగల్, తూముకుంట, నాగారం, దమ్మాయిగూడ, ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి 1,39,030 దరఖాస్తులు రాగా, అలాగే, 61 గ్రామ పంచాయతీల పరిధిలో 4,897 దరఖాస్తులు వచ్చాయి.
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు 1,43,927 రాగా, వీటికి ఒక్కో దరఖాస్తుకు రూ. 1,000 చొప్పున ఫీజు వసూలు చేశారు. ప్రభుత్వానికి వీటి ద్వారానే రూ. 14.39 కోట్ల ఆదాయం సమకూరింది.

సహాయ కేంద్రాల ఏర్పాటుపై...

స్థలాల క్రమబద్ధీకరణపై జారీ చేయనున్న నోటీసులకు సంబంధించిన ఏమైనా సమస్యలు తలెత్తితే... వాటిని నివృత్తి చేసేందుకు కలెక్టరేట్, పురపాలక సంఘాల్లో సహాయ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తున్నది.

- జిల్లాలో అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చినందున సదరు ప్రక్రియకు సంబంధించి ప్రతి వారం సమీక్ష చేసేందుకు చర్యలు తీసుకునే అవకాశాన్నీ పరిశీలిస్తున్నారు.

నిధుల వరద...

నిధులు లేక ఇబ్బంది పడుతున్న పురపాలక సంఘాలు, గ్రామ పంచాయతీలకు ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా పెద్దమొత్తంలో నిధులు సమకూరే అవకాశం ఉంది. ప్లాటు మార్కెటు విలువలో 14 శాతం ఫీజు వసూలు చేయనుంది. చాలా పట్టణాల్లో విలువైన ప్రాంతాల్లోనే అనధికారిక ప్లాట్లు ఉండడంతో 13 పురపాలక సంఘాలతోపాటు 61 గ్రామ పంచాయతీల్లో రూ. కోట్లల్లో ఆదాయం సమకూరుతుందని అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో పట్టణాలు ,గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేసేందుకు అవకాశం ఉంటోంది.

నాలుగు దశల్లో పరిశీలన...

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను వివిధ నిబంధనల ప్రకారం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో వడపోస్తారు. ఆయా ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లయితే దరఖాస్తుదారులకు సమాచారం అందుతోంది. పూర్తిస్థాయిలో పత్రాలు సమర్పించకపోయినా సమాచారం రానుంది. వచ్చిన దరఖాస్తులను రెవెన్యూ, ఇరిగేషన్, పట్టణ ప్రణాళిక, పంచాయతీ శాఖల అధికారుల బృందం క్షేత్ర స్థాయిలో పరిశీలించనుంది.

- నాలాలు, చెరువులు, కుంటలు వారసత్వ సంపద, శిఖం, దేవాదాయ, ఈనాం భూములు వంటివి పరిశీలించి అభ్యంతరాలు ఉన్నట్లయితే నమోదు చేసుకుంటారు. అర్హత ఉన్న వాటిని వెంటనే పరిశీలించి కావాల్సిన పత్రాలతో పాటు ఫీజు చెల్లించేలా సంబంధిత దరఖాస్తుదారుడికి నోటీసు జారీ చేస్తారు.
- దరఖాస్తుదారుడికి సంబంధించి అన్ని వివరాలు సక్రమంగా ఉంటే క్రమబద్ధీకరించి ఉత్తర్వులు జారీ చేస్తారు. జిల్లా అదనపు కలెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీ వాటిని పరిశీలించిన తర్వాతే క్రమబద్ధీకరణ చేస్తారు.

ఫ్లైఓవర్ కింద ఇండోర్ క్రీడా ప్రాంగణం



పూర్తి కావొచ్చిన క్రీడా ప్రాంగణం

తుదిదశకు పనులు

- నెలాఖరులోగా అందుబాటులోకి..
- సరికొత్త ప్రణాళికలతో అధికారులు

కేపీహెచ్‌బీ కాలనీ: కేపీహెచ్‌బీలోని ఫ్లై ఓవర్ కింద భాగంలో ఇకపై ఇండోర్ క్రీడలు కూడా ఆడవచ్చు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్మితమైన ఫ్లైఓవర్ బ్రిడ్జి కింది స్థలాన్ని సద్వినియోగం చేసుకునేలా జీహెచ్‌ఎంసీ అధికారులు సరికొత్త ప్రణాళికలు రూపొందించారు. ఇప్పటికే మంజీరామాల్ వద్ద ఫ్లై ఓవర్ కింది భాగంలో పచ్చదనం, చెట్లు మానవాళి మనుగడకు ఏవిధంగా దోహదపడతాయో తెలిపే చిత్రాలను బ్రిడ్జి పిల్లర్లపై వేయడం ద్వారా జీహెచ్‌ఎంసీ అధికారులు స్థానికుల ప్రశంసలు పొందారు.మూసాపేట సర్కిల్ అధికారులు ఫోరంమాల్ ఎదుట బ్రిడ్జి కింది భాగాన్ని వినూత్న రీతిలో అందుబాటులోకి తీసుకువస్తున్నారు. గత జోనల్ కమిషనర్ మమత హయాంలో ఇక్కడి ఖాళీ స్థలాన్ని ద్విచక్ర వాహనాల మోడల్ పార్కింగ్ కేంద్రంగా తీర్చిదిద్దినప్పటికీ వాహనదారుల నుంచి స్పందన కరువైంది. వ్యాపార, వాణిజ్య కేంద్రాలకు నిలయంగా మారిన కేపీహెచ్‌బీ కాలనీలో ద్విచక్ర వాహనాల పెయిడ్ పార్కింగ్‌కు స్పందన లేకపోవడంతో దానిని తొలగించారు. దాని స్థానంలో చిన్నారులు, యువత ఆడుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

15లోగా పూర్తి చేస్తాం..

మినీ క్రీడలకు అనువుగా రూపుదిద్దుకుంటున్న ఈ ప్రాంగణాన్ని ఈ నెల 15లోగా పూర్తి చేస్తాం. నెలాఖరులోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం. ఇందులో స్కేటింగ్, మినీ ఫుట్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, క్రికెట్ వంటి ఆటలు ఆడుకోవచ్చు. – ఏఈ సాయిప్రసాద్

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ఆల్విన్‌కాలనీ: తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ పైపులైన్ రోడ్డులోని దుర్గాబాయి మహిళా శిశు వికాస కేంద్రంలో సోమవారం మహిళలకు ఎలక్ట్రికల్ ఆటో డ్రైవింగ్ శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండ్రు శోభారాణి, మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి వెస్లీలు కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ శోభారాణి మాట్లాడుతూ ప్రతి మహిళా సాధికారత దిశగా పయనించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు ఉపాధి అవకాశాలకు పెద్ద పీట వేస్తున్నారన్నారు. 6 నుంచి 8 వారాల పాటు శిక్షణ ఇచ్చి డ్రైవింగ్ లైసెన్స్ అందించటానికి సహాయం అందిస్తారన్నారు. ఈ సదవకాశాన్ని ప్రతి మహిళా సద్వినియోగం చేసుకొని డ్రైవింగ్‌లో తర్ఫీదు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంగణం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన టీజీడబ్ల్యూసీడీసీ చైర్‌పర్సన్ శోభారాణి, ఎండీ క్రాంతి వెస్లీ